

ప్రజా **రిపబ్లిక్**

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 02 సంచిక -350 పేజీలు - 8 వెల - 03/- మంగళవారం 7 ఏప్రిల్ 2026



**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888


# జలధారతో ప్రతీ ఎకరానికి నీరు

## యాడికి ' జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



- నీరు ఉంటే... సంపద ఉన్నట్లే
- జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్
- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
- నీటి భద్రత..సాగునీటి సంఘాల బాధ్యత యాప్ లాంచ్
- అమరావతికి చట్టబద్ధతపై సీమ ప్రజల హర్షం
- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం

**అనంతపురం,ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**
బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో **మిగతా 2లో...**







## ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి


### గెజిట్ విడుదల చేసిన కేంద్రం

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత
- కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ
- 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు వెల్లడి


2లో.

## ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

- ఇరాన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవచ్చు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఇరాన్‌లో చిక్కుకున్న రెండో అమెరికా పైలట్‌ను రక్షించిన సైన్యం
- 155 విమానాలతో చారిత్రాత్మక రెస్క్యూ ఆపరేషన్ నిర్వహణ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఒక్క రాత్రిలోనే ఇరాన్ దేశాన్ని పూర్తిగా తుడిచిపెట్టగలమని, ఆ రాత్రి రేపే కావచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో కూలిపోయిన అమెరికా ఎఫ్-15 విమాన సిబ్బందిలో రెండో వ్యక్తిని **మిగతా 2లో...**

## పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్

- మోదీ, అశ్విని వైష్ణవ్, చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కళ్యాణ్
- ఆధునీకీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయి ప్రాముఖ్యతను వివరించిన పవన్



2లో.

## నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

- రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం
- గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు
- ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి
- పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చన్న



**శ్రీకాకుళం,ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**
శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు.**మిగతా 2లో...**



## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

- భూమి నుంచి రికార్డు దూరంలో
- 1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం
- 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు

2లో.

## ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష...

మధురై కోర్టు సంచలన తీర్పు

సాతంకులం కస్టడీ మరణాల కేసులో సంచలన తీర్పు


2లో.

# హామీలు నెరవేరుస్తున్నాం

## రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

- మేం పాలకులం కాదు..ప్రజా సేవకులం
- ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం
- ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే
- : పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**ఆదిలాబాద్ ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు**మిగతా 2లో...**

## సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు

జెఎన్టీ టియూ స్నాతకోత్సవంలో గవర్నర్



6లో.

# జలధారతో ప్రతీ ఎకరానికి నీరు









**మొదటిపేజీ తరువాయి**

మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిందని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ. 1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు–మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో అమృత్ భారత్ స్కీమ్‌లోకి పిఠాపురం రైల్వే స్టేషన్

**ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ చేసిన కృషి ఫలించింది. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం స్టేషన్‌ను చేర్చుతూ రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ అభివృద్ధి, ఆధునికీకరణ పనుల కోసం రూ. 37.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో పిఠాపురం స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

కొద్ది నెలల క్రితం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆవశ్యకతను ఆయనకు సమగ్రంగా వివరించారు. పురాణ ప్రాధాన్యం ఉన్న పిఠాపురం పట్టణానికి దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తుంటారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ నొక్కిచెప్పారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిజానికి, పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో పిఠాపురంలో పర్యటించినప్పుడు ఆయన క్షేత్రస్థాయిలో స్టేషన్‌ను పరిశీలించారు. ఆ సమయంలో స్టేషన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, దుర్గంధం వెదజల్లడం గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఆనాడే స్టేషన్ రూపురేఖలు మార్చాలని ఆయన నిశ్చయించుకున్నారు.

పవన్ కళ్యాణ్ అభ్యర్థన పట్ల కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో, ఇక పిఠాపురం స్టేషన్ సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. ఈ నిధులతో స్టేషన్ ప్రధాన భవనం, ముఖద్వారం నిర్మాణం, ప్లాట్‌ఫారమ్‌ల అభివృద్ధి, కొత్త షెల్టర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గది, అత్యాధునిక టాయిలెట్లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్ పనులను కూడా పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. తాను అడిగిన వెంటనే పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, తక్షణం స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కూడా పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు.

# హామీలు నెరవేరుస్తున్నాం

**.మొదటిపేజీ తరువాయి**



పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ. 10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ. 5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2


**భూమి నుంచి రికార్డు దూరంలో**

**1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం**

**10న పసిఫిక్ మహాసముద్రంలో**

**ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు**

**న్యూయార్క్**: అమెరికా అంతరిక్ష సంస్థ–నాసా చేపట్టిన ఆర్టెమిస్–2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం. ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.



# ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి... గెజిట్ విడుదల చేసిన కేంద్రం

**ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి చట్టబద్ధత ఏర్పడింది. అమరావతిని ఏపీ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం నేడు అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత లభించినట్లయింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అమరావతి రాజధాని సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పార్లమెంటుకు పంపిన విషయం తెలిసిందే. అక్కడ లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయడంతో, దీనికి అధికారిక ముద్ర పడింది. ఈ ప్రక్రియలన్నీ పూర్తవడంతో కేంద్ర న్యాయశాఖ తుది నోటిఫికేషన్ జారీ చేసింది.

2014 నాటి సీఆర్డీయే చట్టంలో పొందుపరిచిన అమరావతిని రాజధానిగా నోటిఫై చేస్తున్నట్లు ఇందులో స్పష్టం చేసింది. ఈ సవరణ చట్టం 2024 జూన్ 2వ తేదీ నుంచే అమల్లోకి వచ్చినట్లుగా (retrospective effect) గెజిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 5, సబ్–సెక్షన్ (2)లో ఉన్న "కొత్త రాజధాని ఉంటుంది" (a new capital) అనే పదబంధం స్థానంలో "అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది" (Amaravati shall be the new capital) అని మార్పు చేశారు. ఈ సవరణ ద్వారా 'అమరావతి' అనే పదానికి కూడా చట్టంలో స్పష్టత ఇచ్చారు. 'అమరావతి' అనగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (జ=ణూ) చట్టం, 2014 నిబంధనల ప్రకారం నోటిఫై చేయబడిన రాజధాని నగర ప్రాంతాలు అని వివరణ జోడించారు. రాష్ట్రపతి ఆమోదం, గెజిట్ ప్రచురణతో ఈ చట్ట సవరణ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చినట్లయింది.

# ఒక్క రాత్రిలో ఇరాన్‌ను తుడిచిపెట్టగలం

**మొదటిపేజీ తరువాయి**

విజయవంతంగా రక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌ను 'దుష్టశక్తి'గా అభివర్ణించిన ట్రంప్, ఆ దేశ పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామంటూ గతంలో సోషల్ మీడియాలో చేసిన హెచ్చరికలను పునరుద్ఘాటించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను 'చారిత్రాత్మకం'గా అభివర్ణించిన ట్రంప్, అమెరికా సైన్యం ఏ ఒక్క అమెరికన్‌ను వెనుక వదిలిపెట్టదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 155 విమానాలు పాల్గొన్నాయని, వాటిలో 4 బాంబర్లు, 64 ఫైటర్ జెట్లు, 48 రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, 13 రెస్క్యూ విమానాలు ఉన్నాయని వివరించారు. వేలాది మంది ఇరాన్ సైనికులు గాలిస్తుండగా, వారిని తప్పుదోవ పట్టించేందుకు సైనికుడు వేరే ప్రాంతంలో ఉన్నాడనే భ్రమ కల్పించి ఈ ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. దాదాపు 48 గంటల పాటు ఇరాన్ దళాలకు చిక్కకుండా ఆ 'వీర సైనికుడు' తప్పించుకు తిరిగాడని ప్రశంసించారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, రక్తం కారుతున్నా ఆ సైనికుడు కొండచరియలు ఎక్కి తన లొకేషన్‌ను చేరవేశాడని ట్రంప్ చెప్పారు. ఆపరేషన్ అనంతరం వెనుక వదిలేసిన తమ విమానాల్లోని సాంకేతికత ఇరాన్‌కు చిక్కకుండా ఉండేందుకు, వాటిని పూర్తిగా పేల్చివేసినట్టు ట్రంప్ వెల్లడించారు.

అయితే, ఈ రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని కొన్ని మీడియా సంస్థలు ముందుగానే లీక్ చేయడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లీక్ వల్ల అమెరికా సైనికుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. "ఇది చాలా దారుణం. ఈ లీక్‌కు కారణమైన వ్యక్తిని మేం కచ్చితంగా పట్టుకుంటాం. వార్తను ప్రచురించిన మీడియా సంస్థ వద్దకు వెళ్లి, జాతీయ భద్రత దృష్ట్యా సోర్స్‌ను అప్పగించమని కోరతాం, లేదంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది" అని ట్రంప్ నేరుగా హెచ్చరించారు.

# ఒకేసారి 9 మంది పోలీసులకు ఉరిశిక్ష... మధురై కోర్టు సంచలన తీర్పు



**మధురై ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతంకుళం కస్టడీ మరణాల కేసులో మధురై కోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. తండ్రీకొడుకులైన జయరాజ్, బెన్నిక్స్‌ల మృతికి కారణమైన తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి, వారికి మరణ శిక్ష విధించింది. సోమవారం మదురై మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి. ముత్తుకుమారన్ ఈ తీర్పును ప్రకటించారు. ఈ కేసును "అత్యంత అరుదైన కేసు" (రేర్ ఆఫ్ ది రేరెస్ట్)గా అభివర్ణించిన న్యాయమూర్తి, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో దోషులుగా తేలిన వారిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి. రఘు గణేశ్, కె. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్. మురుగన్, ఏ. సామిదురై, కానిస్టేబుల్స్ ఎం. ముత్తురాజ్, ఎస్. చెల్లదురై, థామస్ ఫ్రాన్సిస్, ఎస్. వెయిలుముత్తు ఉన్నారు. విచారణ సమయంలో పదో నిందితుడైన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కోవిడ్‌తో మరణించాడు. కేసు నేపథ్యం: 2020 జూన్ 19న, కోవిడ్–19 లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 9 గంటల తర్వాత దుకాణం తెరిచి ఉంచారనే ఆరోపణలతో సాతంకుళం పోలీసులు వ్యాపారులైన పి. జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్‌ను అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో వారిని అత్యంత అమానుషంగా, క్రూరంగా హింసించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన వారిపై తప్పుడు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ హింస కారణంగా బెన్నిక్స్ జూన్ 22న, జయరాజ్ జూన్ 23న చికిత్స పొందుతూ మరణించారు. ఎలాంటి నేరచరిత్ర లేని వారి మరణం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. మొదట మదురై హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించగా, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో పోలీసుల దారుణాలు బయటపడ్డాయి. పోస్ట్‌మార్టం నివేదికలు కూడా వారిద్దరి మరణానికి తీవ్రమైన గాయాలే కారణమని స్పష్టం చేశాయి. సీబీఐ వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, మార్చి 23న తొమ్మిది మందిని దోషులుగా నిర్ధారించి, సోమవారం వారికి శిక్ష ఖరారు చేసింది. దోషులందరికీ మరణ శిక్షతో పాటు, బాధిత కుటుంబానికి రూ. 1.40 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

**మొదటిపేజీ తరువాయి**



మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్‌లలో భోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్త్‌లు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎంఎ÷–లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# క్యూఆర్ కోడ్, ప్రభుత్వ రాజముద్రతో వున్న నూతన పట్టాదారు పాస్ పుస్తకాల రైతులకు పంపిణి చేసిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య

**పాములపాడు ఏప్రిల్ 6 రిపబ్లిక్ న్యూస్:-** నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలంలోని, భానకచర్ల గ్రామంలోఈ రోజు "మీ భూమి - మీ హక్కు" ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ గిత్త.జయసూర్య ముఖ్య అతిథిగా పాల్గొని, రెవిన్యూ అధికారులతో, నాయకులతో కలిసి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. మొదట నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాండ్ర.సురేంద్రనాథ్ రెడ్డి లకు తహసీల్దార్- జి.సుభద్రమ్మ, రీ సర్వే డి.టీ - సుప్రియా లు పుష్ప గుచ్చాలు చేతికి అందజేసి ఘన స్వాగతం పలికారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.. జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల కళ్ళల్లో వెలిగి నింపేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిందని అన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోను చూసిన రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని ,భూమి సరిహద్దు రాళ్లపై కూడా అప్పటి ముఖ్యమంత్రి ఫోటో ముద్రించుకోవడంతో రైతులు తమ భూమి ఏమైపోతుంది అని ఆవేదన చెందారని, ఈ రోజు కూటమి ప్రభుత్వం రైతులకు మంచి చేసేందుకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నమన్ఘిన అన్నారు. లిటికేషన్ భూములు క్రమబద్దీకరణ ,భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపిందని కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకొని రైతులకు మంచి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగడం కూటమి ప్రభుత్వ విధానాలకు నిదర్శనమని ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కొనియాడారు.

ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ & టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర రెడ్డి, ఎస్ఐ- పి.తిరుపాలు, మండల కన్వీనర్ జి.రవీంద్రరెడ్డి, భాస్కర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ లు గోవిందు, లక్ష్మికాంత రెడ్డి,టిడిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు - షేక్.కరీం భాష, మరియు గ్రామ నాయకులు, మండల నాయకులు, ప్రభుత్వ అధికారులు రైతులు పాల్గొనడం జరిగింది.

# రైతు కు ఇచ్చే సబ్సిడీలు, మహిళా రుణాలపై ఆరా

## మార్కెట్ యార్డ్ షాపులను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి -టెక్కె ప్రాంతంలో మంత్రి ఫరూక్ ఆకస్మిక తనిఖీ

**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 6 (రిపబ్లిక్ న్యూస్)**

పట్టణంలోని టెక్కె ప్రాంతంలో ఉన్న వివిధ సహకార సంస్థలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శిల్పా సూపర్ మార్కెట్, శిల్పా మహిళా సహకార్, శిల్పా రైతు సమాఖ్య, నంది రైతు సమాఖ్యలను నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ స్వయంగా తనిఖీ చేశారు. మంత్రి ఫరూక్ షాపులన్నింటినీ కలియతిరుగుతూ, రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, మహిళలకు మంజూరు చేస్తున్న రుణాలు, సామాన్య ప్రజలకు నిత్యవసర సరుకులపై ఇస్తున్న డిస్కౌంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ షాపుల లీజు గడువు ముగిసినందున, వాటిని నిర్వహిస్తున్న వారు వెంటనే మార్కెట్ యార్డ్‌కు షాపులను అప్పగించాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. "ప్రస్తుతం ఒక్కో షాపుకు కేవలం రూ. 2,700 మాత్రమే అద్దె చెల్లిస్తున్నారు, ఇది వాస్తవ మార్కెట్ ధర కంటే చాలా తక్కువ. ఇదే ప్రాంతంలో ఎదురుగా ఉన్న షాపుల అద్దె రూ. 15,000 నుండి రూ. 20,000 వరకు ఉందని . ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ఉండేందుకు





వీటిని వెంటనే హ్యాండోవర్ చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్ యార్డ్ ఆస్తులను సక్రమంగా వినియోగించుకోవాలని, లీజుదారులు సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సూచించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగపడాలని . టెక్కె ప్రాంతంలోని ఈ షాపుల లీజు గడువు ఎప్పుడో ముగిసిపోయిందని ప్రస్తుతం ఇక్కడ ఒక్కో షాపుకు కేవలం ₹2,700 మాత్రమే అద్దె చెల్లిస్తుండటం గమనార్హం అన్నారు. సరిగ్గా వీటికి ఎదురుగా ఉన్న ప్రైవేటు షాపుల బాడుగలు ₹15,000 నుండి ₹20,000 వరకు పలుకుతున్నాయన్నారు . ఇలాంటి పరిస్థితుల్లో అతి తక్కువ అద్దెకు ప్రభుత్వ షాపులను కొనసాగించడం వల్ల మార్కెట్ యార్డ్ ఆదాయానికి భారీగా గండి పడుతోందని తెలిపారు. కాబట్టి, లీజుదారులు వెంటనే స్పందించి ఈ షాపులను మార్కెట్ యార్డ్ అధికారులకు హ్యాండోవర్ చేయాలని. అదేవిధంగా, రైతులకు ఇచ్చే సబ్సిడీలు, మహిళలకు అందే రుణాలు, ప్రజలకు నిత్యవసర వస్తువులపై ఇచ్చే రాయితీలు క్షేత్రస్థాయిలో అర్హులకు సక్రమంగా అందుతున్నాయో లేదో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రంగ ప్రసాద్, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు

# వేణుగోపాలస్వామికి వెండి కవచం బహుకరణ



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 06 రిపబ్లిక్ న్యూస్**

స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి దాత స్వామివారికి వెండి కవచాన్ని అందించారు పట్టణంలో గల బజారు వీధుల గల శ్రీరామ్ గోపాల్ శ్రీరామ్ జగదీష్ కుటుంబ సభ్యులు వేణుగోపాలస్వామికి రూ 2.10 లక్షలు విలువ చేయు వెండి వక్షకవచం అందించారు. ఈ మేరకు సోమవారం ఉదయాన్నే దాతలు గ్రామ పెద్దలు జీవన్ ప్రకాష్, కడియాల రాజన్న, బంకు రాజన్న, రంగబాబు, తదితరులచే ఆలయ ప్రధాన అర్చకుడు వశిష్టాచార్యులకు అందించారు. అనంతరం స్వామివారికి అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బోయకొండ అడవిలో వ్యక్తి దారుణ హత్య



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 06 రిపబ్లిక్ న్యూస్**

బోయకొండ సమీపంలోని పక్షిరాజుపురం కు సమీపంలోని అడివిలోవ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన వెలుగు చూసింది తమిళనాడు రాష్ట్రం గుడియాతం కు చెందిన గాంధీ (35)అతని కుమారుడు సందీప్ (4) లు 20 రోజుల క్రితం బోయకొండ సమీపంలోని ఆర్ఆర్ కాలనీలో నివాసముండే తన భార్య రఫాతి ని సొంత గ్రామానికి తీసుకెళ్లేందుకు వచ్చారు.అయితే అప్పటికే ఆర్ఆర్ కాలనీకి చెందిన నరసింహు లతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్న రఫాతి భర్త గ్రామానికి వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో 20 రోజులుగా ఇక్కడే ఉన్నట్లుగా స్థానికులు తెలిపారు.ఈ క్రమంలో నరసింహులు అతని స్నేహితులతో కలిసి గాంధీని అతని కుమారుడు సందీప్ లను ఆదివారం రాత్రి పక్షిరాజుపురం అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లినట్లుగా స్థానికులు తెలిపారు. ఉదయం సందీప్ పక్షిరాజు పురం లోని అంగన్వాడి కేంద్రం కు వచ్చి తన తండ్రిని కొట్టారని చూపిస్తాను అంటూ వారిని తీసుకెళ్లి చూపించగా అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించిన అంగన్వాడి టీచర్ స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అంజన్న వెంటనే పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ ,ఎస్సై చిన్న రెడ్డప్ప లు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. చుట్టుపక్కల వారిని విచారణ జరిపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కళ్యాణ గంగమ్మకు బీరువా బహుకరణ



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 06 రిపబ్లిక్ న్యూస్**

శ్రీ కళ్యాణ గంగమ్మ ఆలయానికి పుంగనూరు పట్టణానికి చెందిన నానబాల గణేష్ మాధవి బీరువాను బహూకరించారు ఈ కార్యక్రమంలో శ్రీరామ రెడ్డి ప్రకాష్, కె.వి రాజన్న, పిల్లారి జీవన్ ప్రకాష్, కడియాల మురళి, గంగారపు గణేష్ గాజుల చంద్రశేఖర్, తుంగ రమేష్, లీలాకుమార్ నాగ్ లు దాతలను ఘనంగా సన్మానించారు.

# పదో తరగతి విద్యార్థులకు 7 మార్కులు కలపాలని ఏపీ ఎస్ఎస్సీ బోర్డు నిర్ణయం



ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఊరటనిచ్చేలా అదనపు మార్కుల కేటాయింపుపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రశ్నాపత్రాల్లో దొర్లిన సాంకేతిక పొరపాట్లు, అస్పష్టంగా ఉన్న ప్రశ్నల వల్ల విద్యార్థులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎస్ఎస్సీ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

బోర్డు నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం, హిందీ సబ్జెక్టులో సందిగ్ధంగా ఉన్న ప్రశ్నల కారణంగా 2 మార్కులు, ఇంగ్లిష్ సబ్జెక్టులో తలెత్తిన లోపాల వల్ల 5 మార్కులు.. మొత్తంగా 7 మార్కులను అదనంగా కలపనున్నారు. ప్రశ్నలు స్పష్టంగా లేని చోట వాటిని అటెంప్ట్ చేసిన విద్యార్థులందరికీ ఈ మార్కులు లభిస్తాయి. ఇది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగడమే కాకుండా, మెరుగైన గ్రేడింగ్ సాధించడానికి దోహదపడనుంది. అయితే, మరో మూడు ప్రశ్నలపై తల్లిదండ్రులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, వాటిలో ఎలాంటి తప్పులు లేవని బోర్డు స్పష్టం చేసింది. ఇప్పటికే డీఈవోలకు, మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు ఈ అదనపు మార్కుల కేటాయింపుపై బోర్డు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది.

# 100 రోజుల కార్యాచరణతో భూగర్భ జలాల పెంపుదలపై దృష్టి

## నీటి ఎద్దడి నివారణకు జలధారజలహారతి కీలకం -రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్







**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**

రాష్ట్రంలో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జలధారజలహారతి" కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామంలో నిర్వహించిన "జలధార నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికగా కొనసాగుతుందని తెలిపారు. చెరువులు నింపడం, ఫీడర్ ఛానల్స్ మరియు వాగుల డీసిల్టింగ్ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పాణ్యం మండలంలో నీటి ఎద్దడి సమస్య ఉన్నప్పటికీ, సిమెంట్ నగర్ ప్రాంతం పైభాగంలో కురిసే వర్షపు నీరు కిందకు చేరి చెరువులను నింపుతుందని వివరించారు. ఈ నీటి వనరులపై తాగునీటి అవసరాలు మాత్రమే కాకుండా పశువులు, పక్షులు కూడా ఆధారపడుతున్నాయని తెలిపారు. గతంలో వర్షాధారంగా మాత్రమే చెరువులు నిండేవని, ప్రస్తుతం నీటి నిర్వహణ చర్యల వల్ల ఆ ప్రాంతాలు సస్యశ్యామలంగా మారి మూడు పంటలు పండుతున్నాయని, గ్రామాల అభివృద్ధి గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ భూగర్భ జలాల మట్టం ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా పాపిలి మండలంలో 20 మీటర్లకు పైగా లోతులో నీరు ఉండగా, 8 నుంచి 20 మీటర్ల మధ్య నీటి మట్టం ఉన్న మండలాలు తొమ్మిది ఉన్నాయని తెలిపారు. మొత్తం 165 గ్రామాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. గత 10 సంవత్సరాల హైడ్రోగ్రాఫిక్ విశ్లేషణ ఆధారంగా నీటి కొరత ఉన్న గ్రామాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థాయిని నిరంతరం పరిశీలిస్తూ శాస్త్రీయ విధానంలో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని స్పష్టం చేస్తూ, ప్రజలు, రైతులు, వాటర్ యూజర్ అసోసియేషన్లు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భూగర్భ జలాల మట్టాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన "3 మీటర్లు 8 మీటర్ల కాన్సెప్ట్" ప్రకారం, వర్షాకాలం అనంతరం భూగర్భ జలాల మట్టం 3 మీటర్లకు పైగా ఉండేలా, ఎండాకాలంలో 8 మీటర్ల కంటే దిగువకు పడిపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు.


# చౌడేపల్లి లో గంగమ్మ జాతర - నేడు ఘనంగా ఊరేగింపు

**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 06 రిపబ్లిక్ న్యూస్**

అన్నమయ్య జిల్లా, పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లిలో గంగమ్మ జాతర వేడుకలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో, రేపు జరిగే ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. నేటి ఊరేగింపులో అమ్మవారిని శోభాయాత్రగా గ్రామ వీధుల మీదుగా తీసుకువెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో యువత పెద్దఎత్తున పాల్గొనడంతో పాటు, పరిసర ప్రాంతాలు మరియు దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జాతర నిర్వహణకు గ్రామ పెద్దలు, యువకులు, నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, భద్రత, పారిశుద్ధ్యం వంటి ఏర్పాట్లు చేశారు. పోలీసులు కూడా భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, జాతరను శాంతియుతంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని ప్రజలను కోరారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామానికి శాంతి, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు.



# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి జిల్లా నాయకుల ఘన స్వాగతం



**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 06, (రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా యాడికి మండలంలోని వేములపాడు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సోమవారం ఉదయం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు జేసీ.అస్మిత్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధురారెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.కేశవరెడ్డి, అహుడా చైర్మన్ టిసి.వరుణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.



# ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

**అనంతపురం సంక్షేమం, ఏప్రిల్ 06,(రిపబ్లిక్ న్యూస్):**
భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనంతపురం నగరంలో సోమవారం ఘనంగా జెండా ఆవిష్కరణలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ , మాజీ ఎమ్మెల్యే శ్రీ మిట్ట పార్థసారథి , బిజెపి రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.మొదట బిజెపి జిల్లా కార్యాలయంలో జెండావిష్కరణ చేసి, తరువాత గుత్తి రోడ్ లో ఉన్న అటల్ బిహారీ వాజపేయి గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పాపంపేటలో బిజెపి జిల్లా కార్యదర్శి చైతన్య , ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నాగేంద్ర ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.తదనంతరం సోములదొడ్డిలో ఉన్న బుడుగజంగ కాలనీలో నాగరాజు, వారి మిత్రబృందం సుమారు 200 కుటుంబాలు పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ , మాజీ ఎమ్మెల్యే మిట్ట పార్థసారథి మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం చేయడం జరిగింది. పార్టీ స్థాపించిన తర్వాత జరిగిన ఎన్నికలలో బిజెపికి కేవలం రెండే రెండు సీట్లు వచ్చాయని కానీ ఆరోజు అటల్ బిహారీ వాజపేయిని బిజెపి పార్టీని చాలామంది అవహేళన చేసినప్పటికీ కృంగిపోకుండా వాజపేయి, అద్వానీ పార్టీని ముందుకు తీసుకెళ్తూ దేశవ్యాప్తంగా పర్యటనలు చేస్తూ కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ వారి జీవితాలను పార్టీ కోసం త్యాగం



చేశారని ఇలాంటి ఎంతోమంది బీజేపీ కార్యకర్తల యొక్క త్యాగాలతోనే ఈరోజు పార్టీ సంస్థాగతంగా బలంగా ఉండి 20 రాష్ట్రాల పైగా అధికారంలో ఉన్నామంటే దానికి కారణం పార్టీ సీనియర్ కార్యకర్తలేనని ఉద్ఘాటించారు.1997 లో వాజపేయి 13 రోజులు ప్రధానమంత్రిగా ఉండి కేవలం ఒక్క ఒక్క సీటుతో ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసినటువంటి వ్యక్తి అని పేర్కొన్నారు. దాని తర్వాత 13 నెలలు ప్రధానమంత్రిగా వాజపేయి ఉన్నప్పుడు పోక్రాన్ టు అను పరీక్ష విజయవంతం చేయడం తర్వాత 1999 నుంచి 2004 వరకు వాజపేయి మూడోసారి ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టాక ఈ దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆర్థిక రంగంలో, ముఖ్యంగా సైనిక రంగంలో ఆయుధాలను బలపరుచుకునే తదితర విషయాల్లో , సర్వ శిక్ష అభియాన్, స్వర్ణ చతుర్భుజి ఇలాగ అనేక మార్పులు వారు ఐదు సంవత్సరాలలో తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించారు, 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష హోదాలో అనేక సమస్యల మీద బిజెపి ఆధ్వర్యంలో



పోరాడారని 2014లో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి చేపట్టాక అనేక మార్పులు మనదేశంలో రావడం జరిగింది, ఈరోజు ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయి అంటే దాని కారణం భారతీయ జనతా పార్టీ నాయకత్వమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రత్నమయ్య,దేవిరెడ్డి లక్ష్మీదేవి,లలిత్ కుమార్ , యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజేష్ యాదవ్, జిల్లా ఉపా అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, నాగరాజు,మారుతి వెంకట ప్రసాద్ , కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దామోదర్,యువ మోర్చా నాయకులు తేజేశ్వర్ రెడ్డి, ఎస్ సి మోర్చా అధ్యక్షులు మల్లోబులు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఇలియాజ్, మండల అధ్యక్షులు రాజేష్,లక్ష్మణ్,అయ్యన్న, మల్లీశ్వరి, పోగులా నాగేంద్ర, రాజేంద్ర ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# కర్నూలు జిల్లాకలెక్టర్ కి వినతిపత్రం

### రెగ్యులర్ విఆర్ఓ లను నియమించాలి -రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ



**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)** రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో కలెక్టర్ కి (పీ జీ ఆర్ ఎస్) ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఓర్వకల్ మండలంలోని వివిధ గ్రామాలకు రెగ్యులర్ విఆర్ఓ ల ను నియమించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఏ. ఆనంద్, ఏ.స్వామి మాట్లాడుతూ ఓర్వకల్లు మండలంలోని కొన్ని గ్రామాలు పేరుకే ఇండస్ట్రియల్ హబ్ అక్కడ రెగ్యులర్ విఆర్ఓ లేనందువల్ల సమస్యలు పెండింగ్ పడుతూనే ఉన్నాయి. ప్రస్తుతము(మీది వేముల విఆర్ఓ గా విధులు నిర్వహిస్తున్నారు, ఉప్పలపాడు గ్రామ విఆర్ఓ గ్రామానికి రావడం లేదు, ఏదైనా సర్టిఫికెట్ కావాలన్నా , సమస్య చెప్పాలన్న మీరు ఓర్వకల్లు వచ్చి సమస్య చెప్పండని చెప్తారు కానీ గ్రామానికి మాత్రం రారు విద్యార్థులు, రైతులు, ప్రజలు చాలా ఇబ్బందులకు గురువుతున్నారు. చరవాని తో సంప్రదించాలన్న సరైన సమయంలో చరవాని తో మాట్లాడటం లేదు ఇలాంటి సమయంలో ప్రజలు విద్యార్థులు రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు, అని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ తరపున కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించి ఓర్వకల్ మండలంలోని విఆర్ఓ లేని ప్రతి గ్రామానికి రెగ్యులర్ విఆర్ఓ ను నియమించాలని కోరడం జరిగింది. ఈ గ్రీవెన్స్ లో పాల్గొన్న నాయకులు విద్యార్థి సంఘం నాయకుడు అయ్యన్న, అయ్యస్వామి, శీను తదితరులు పాల్గొన్నారు

# మాకు నీళ్లు ఇప్పించండి

## తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ.అస్మిత్ రెడ్డి : జిల్లాని అన్ని రంగాల్లో సస్యశ్యామలం చేయాలి -అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**రిపబ్లిక్ సంక్షేమం, ఏప్రిల్ 06, అనంతపురం జిల్లా**
అనంతపురం జిల్లా, తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రజావేదిక (నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత) లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు జేసీ.అస్మిత్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధురారెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.కేశవరెడ్డి, అహుడా చైర్మన్ టిసి.వరుణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




### ప్రతి చెరువుకి, ప్రతి కాలువకి నీళ్లు ఇస్తాం

ఈ సందర్భంగా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ.అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ "?నిన్న గాక మొన్న ముఖ్యమంత్రి గారితో నాకు జరిగిన సంఘటన మీతో పంచుకుందాం అని చెప్పి ముందుకు వచ్చా. గత సంవత్సరం అసెంబ్లీ సమావేశాలు జరిగేటప్పుడు ముఖ్యమంత్రి గారి చాంబర్‌కి నేను వెళ్ళాను. అక్కడికి వెళ్ళి.. ?"అయ్యా! మా యాడికి కాలువకు, ముచ్చుకోట రిజర్వాయర్‌కి నీటి కేటాయింపులు లేవు. దయచేసి ఒక జీవో ఇప్పించండి" అని చెప్పి ముఖ్యమంత్రి గారి దగ్గరికి వెళ్ళా. ?అప్పుడు ముఖ్యమంత్రి గారు ఒకటే అన్నారు. నా భుజం పక్కనే ఉంటే, దగ్గరకు లాక్కొని, భుజం మీద చేయి వేసి, మనందరికీ తెలిసిందే కదా మన ముఖ్యమంత్రి , తడుతూ తడుతూ ఒకటే చెప్పారు. "ఇదిగో తమ్ముడు! జీవో గీవో ఇచ్చేది లేదు గానీ, ఖచ్చితంగా ప్రతి చెరువుకి, ప్రతి కాలువకి నీళ్లు ఇచ్చే బాధ్యత నాది, నువ్వు పో" అని చెప్పి నాకు ధైర్యం ఇచ్చి పంపించారు. ?నేనేం చెప్తా మొదటిసారి ఎమ్మెల్యేని. మొదటిసారి ఎమ్మెల్యేకి ఏం తెలుస్తుంది? ఒక కాగితం నా చేతిలో ఉంటే అధికారులతో మాట్లాడేదానికి ఏదో ఒకటి ఉండేది అనుకున్నా. ఒకవైపు ఏమో ఆయన ధైర్యం ఇచ్చాడు.. "నువ్వు పో, నేను ఇస్తా నీళ్లు" అని. ఇంకోవైపు ఎటువంటి కాగితం లేదు. మళ్ళీ అధికారులతో ఏమని గొడవ పెట్టుకోవాలో అని దిగులుతో బయటకు వచ్చాను. ?మీరు నమ్ముతారో లేదో.. ఖచ్చితంగా తాడిపత్రిలో ఆ సమావేశాలు అయిపోయేలోపల, జీవో వచ్చే లోపల అధికారుల నుంచి ఫోన్ వచ్చింది. ?"సార్.. సీఎం ఆఫీస్ నుంచి మాకు ఆదేశాలు వచ్చాయి. ప్రతి చెరువుకి, ప్రతి కాలువకి నీళ్లు ఇవ్వాల్సిందే, మన రైతులకు ఎటువంటి దిగులు లేదు ఈసారి" ?అని చెప్పారు. అన్నట్టుగానే మనకి నీళ్లు అందించారు. ?సార్.. మీరు నమ్ముతారో లేదో.. మా ఊర్లో మామూలుగా డిసెంబర్ నాటికే నీళు ఉండవు సార్. కానీ ఈసారి మాత్రం ఏప్రిల్ నెలలో కూడా మేము నీళ్లు ఇచ్చే స్థాయికి వచ్చామంటే.. అది మీ చలవే సార్, మీ ఆలోచనే సార్. ఇంకో విషయం చెప్తా సార్ మీకు. ఆనాటి భగీరథుడు గంగమ్మని నేలపైకి తెచ్చాడో లేదో తెలియదు కానీ, మీరు మాత్రం ఈనాటి భగీరథుడై మాకు నీళ్లు ఇచ్చి మా దాహాన్ని తీర్చారు సార్. కష్టాల్లో ఉన్నప్పుడు ఆపద్బాంధవుడై మా కన్నీళ్లు తుడిచారు సీఎం సార్. చివరికి రైతు గుండెల్లో ఒక పరశురాముడిలా మిగిలిపోయారు సార్ మీరు అని అన్నారు. మాకు చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, ఎప్పుడైతే జె.సి. దివాకర్ రెడ్డి , మా పెదనాన్న శాసనసభ్యులుగా ఉన్నారో.. ఒకవైపు నార్పల కాలువ, ఒకవైపు యాడికి కాలువలు, మాకు ఒకవైపు క్లస్టర్ కాలువలు, ఇంకొకటి పెండెకల్ రిజర్వాయర్, చాగల్లు రిజర్వాయర్.. ఇవన్నీ కట్టించుకున్నాం. ఈ ప్రాజెక్టులు అంతా మధ్యలో దాదాపు 70 శాతం పూర్తి అయ్యాయి, కేవలం ఒక 30 శాతం పూర్తి చేసుకున్నామంటే, ఖచ్చితంగా రాబోయే కాలంలో లక్ష కాదు, 1,50,000 ఎకరాలకి నీళ్లు ఇచ్చే సామర్థ్యం మనకు ఉంది అని మరోసారి మీకు తెలియజేసుకుంటున్నానని అని విన్నవించారు. మా యాడికి ప్రజలకు ఎన్నాళ్ల నుంచో ఒక కోరిక ఉంది, మా యాడికిలో యువత ఉన్నారు.. కాలేజీ నుంచి డ్రాపౌట్స్ ఎక్కువైపోతున్నాయి, కేవలం ఒకే ఒక కారణం.. మాకు దగ్గర్లో ఎటువంటి జూనియర్ కాలేజీ లేదు.. ఒకవైపు చూస్తే తాడిపత్రి దాదాపు 30 కిలోమీటర్లు, ఇంకోవైపు చూస్తే గుత్తి అదొక 30 కిలోమీటర్లు, హెడ్ క్వార్టర్ అనంతపూర్ అయితే అదొక 60 కిలోమీటర్లు ఉంది, మీ ఇళ్లల్లో పిల్లలు మీరు ఇంట్లో ఉండిపోండి, మాకు చదువులు వద్దు అని చెప్పి డ్రాపౌట్స్ ఎక్కువైపోతున్నాయని అన్నారు. ఒకవైపు భూమిని నమ్ముకున్నాం, మాకు ఇది తప్ప మాకు వేరే ఏదీ రాదు చేసుకోవడానికి, దయచేసి మా కాలువలు పూర్తి చేయండని, మాకు మళ్ళీ నీళ్లు వచ్చే విధంగా చేయండని కోరారు. అదే విధంగా మా యువతకు మరోసారి భరోసా ఇవ్వాలని "నేనున్నాను" అని చెప్పి మీరు రైతాంగానికి కూడా భరోసా ఇచ్చినట్టు అవుతుందన్నారు. ఇప్పటికీ యువత చాలా మంది ముందుకు రావట్లేదు, మీరు గాని భరోసా ఇచ్చారంటే ఖచ్చితంగా రాబోయే కాలంలో ముందే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్కువైపోతుందంటున్నారు, ఉద్యోగాలు ఉంటే ఉద్యోగాలు ఎక్కడికి పోవు. లక్ష ఉద్యోగాల దగ్గర ఒక 70,000 ఉద్యోగాలు రావచ్చెమో.. ఈ 30,000 మందికి మనం న్యాయం చేయాలంటే ఖచ్చితంగా మా కాలువలు పూర్తి చేసుకోవాలి, మా రిజర్వాయర్లు పూర్తి చేసుకోవాలని, మాకు నీళ్లు ఇప్పించండి, మా రైతులు బాగుండాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నానని పేర్కొన్నారు.

### రైల్వే కనెక్టివిటీ కోసం రూ. 3500 కోట్ల బడ్జెట్ కేటాయింపు

ఈ సందర్భంగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా అంటే భారతదేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే రెండవ జిల్లా అయినటువంటి ఈ జిల్లాని అన్ని రంగాల్లో సస్యశ్యామలం చేయాలన్నారు. ఈ ప్రాంత రైతన్నలకి, ప్రతి ఒక్కరికి కూడా నీళ్లివ్వాలనేటువంటి కార్యక్రమంతో ఈరోజు జలధార కార్యక్రమాన్ని తీసుకొచ్చి, సాగునీటి సంఘాలని బలోపేతం చేస్తూ వారందరినీ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా 100 రోజుల పాటు ఈ జలధార కార్యక్రమాన్ని నిర్వహించుకుని, మన ప్రాంతాన్ని కూడా సస్యశ్యామలం చేసుకోవడం కోసం, భూగర్భ జలాల్ని పెంచుకునేలా చేసే కార్యక్రమానికి ఈరోజు అనంతపురం జిల్లాలో శ్రీకారం చుట్టి, జిల్లా మీద ఉన్నటువంటి ప్రేమ, మమకారాన్ని మరొక్కసారి ముఖ్యమంత్రి మన పట్ల చూపిస్తున్నందుకు నిజంగా వారికి శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేసుకుంటున్నానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అనేక సమస్యల్లో భాగంగా ఈరోజు నిత్యం కూడా పని చేస్తూ 24 గంటలు కూడా సరిపోవట్లేదని చెప్పేసి ఈరోజు మన రాష్ట్రం కోసం, అదేవిధంగా ప్రత్యేకించి మన జిల్లా కోసం, చిత్తూరు జిల్లా వాసులైనా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అనంతపురానికి ఎప్పుడూ ఆపద్బాంధవుడిలా ఉన్నారనే విషయాన్ని గుర్తు చేస్తూ.. ?ఇటీవల కాలంలోనే హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ విస్తరణ కోసం, రైల్వే కనెక్టివిటీ కోసం దాదాపు 3500 కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించి, 100 రోజుల్లోనే 1500 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినటువంటి ఏకైక నాయకుడు, ఏకైక ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది మన ముఖ్యమంత్రి గారని చెప్పవచ్చున్నారు. మాకు ఇక్కడ డయాలసిస్ సెంటర్స్ లేకపోవడం వల్ల కిడ్నీ పేషెంట్లు చాలా ఇబ్బంది పడుతున్నారని, కాబట్టి తాడిపత్రిలో ఒకటి, గుంతకల్లులో ఒకటి డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని మిమ్మల్ని కోరుతున్నానన్నారు. ?అలాగే హార్టికల్చర్ పంటలకు సంబంధించి, గత ఏడాది లక్ష టన్నుల అరటిని మనం విదేశాలకు పంపించామని, తాడిపత్రి ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నానన్నారు. ప్రధానమంత్రి కూడా 'మన్ కీ బాత్' కార్యక్రమంలో జనవరి 25వ తేదీన అనంతపురం జిల్లా రైతన్నల గురించి తెలుగులో మాట్లాడారన్నారు. అనంతపురం జిల్లా రైతన్నలు కష్టానికి భయపడరు, ఏడు చెరువులను నిర్మించుకుని భూగర్భ జలాలను పెంపొందించే దిశగా వారు చేస్తున్న కృషిని ప్రధాని అభినందించారన్నారు. ?అమరావతి రాజధాని కోసం రైతులు చేసిన త్యాగాలను గుర్తిస్తూ, పార్లమెంటు ఉభయ సభల్లో కూడా మంత్రి నారా లోకేష్ సాక్షిగా బిల్లులు పాస్ చేయించి రాజధానిగా అమరావతిని ఖరారు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# చిప్పగిరిలో ఆధ్యాత్మిక ఉత్సాహంతో గంధం మహోత్సవం





**చిప్పగిరి, ఏప్రిల్, 6,( రిపబ్లిక్ న్యూస్ )**
మండల కేంద్రంలోని ప్రసిద్ధ హజరత్ సయ్యద్ షా సుల్తాన్ మోహియిద్దీన్ ఖాద్రి (భంభం బాబా ) దర్గా ప్రాంగణం సోమవారం భక్తి శ్రద్ధలతో నిండిపోయింది. 117వ గంధం మహోత్సవం సందర్భంగా దర్గా ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతితో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి భంభం బాబా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ గంధం వేడుకలను వంశీయులు సయ్యద్ ఆరిఫుద్దీన్ ఖాద్రి, సయ్యద్ అర్షద్ హాదీ ఖాద్రి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పవిత్ర సమాధులపై సుగంధ గంధాన్ని ఘనంగా ఎక్కించి, ప్రత్యేక దువాలు, మిలాద్ కార్యక్రమాలతో ఉత్సవాలకు శోభ చేకూర్చారు. ఈ సందర్భంగా దర్గా పరిసరాలు భక్తుల ప్రార్థనలతో మారుమ్రోగాయి. భక్తులు తమ కుటుంబ శ్రేయస్సు, ఆరోగ్యం, సుఖశాంతులు కలగాలని మనసారా ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించి వందలాది మందికి ప్రసాదం పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది. ఈ మహోత్సవంలో గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు, యువకులు, మహిళలు విశేషంగా పాల్గొన్నారు. గంధం వేడుకలు మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తూ ప్రాంత ప్రజల్లో ఐక్యతను మరింత బలపరిచాయని నిర్వాహకులు సయ్యద్ షా వంశీయులు తెలిపారు.

# కాల్వబుగ్గ బుగ్గ రామేశ్వరం ఆలయ చోరీ కేసు ఛేదన

**ఇద్దరు నిందితులు అరెస్ట్**

**4 కిలోల వెండి స్వాధీనం**

**మొత్తం 10 కిలోల దొంగతనం**

**మిగిలిన ముగ్గురి కోసం గాలింపు**

**ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడి**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఏప్రిల్ 6)**
కర్నూలు జిల్లా కాల్వబుగ్గలోని శ్రీ భ్రమరాంబ బుగ్గ రామేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు 4 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ వివరించారు.
ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో Cr.No: 46/2026 కింద నమోదైన ఈ కేసు ప్రకారం, మార్చి 16/17 తేదీల్లో రాత్రి గుర్తుతెలియని దొంగలు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. మొత్తం సుమారు 10 కిలోల వెండి వస్తువులు దొంగిలించబడినట్లు గుర్తించారు. విచారణలో భాగంగా మహారాష్ట్రకు చెందిన అర్జున్ పూనం కుంబ్హార్, అక్షయ్ జైసింగ్ ఠాకూర్‌లను ఏప్రిల్ 5న అరెస్ట్ చేశారు.
నిందితులు ముందుగా ఆలయాలను గూగుల్ మ్యాప్స్ ద్వారా గుర్తించి రెక్కీ చేసి, రాత్రి వేళల్లో తాళాలు కట్ చేసి చోరీలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేరంలో మొత్తం ఐదుగురు పాల్గొన్నట్లు గుర్తించగా, మిగిలిన ముగ్గురిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.
నిందితుల వద్ద నుండి వెండి నాగాభరణాలు, సింహం విగ్రహ భాగాలు, అమ్మవారి పీటం ముక్కలు, ధారా పాత్ర వంటి వస్తువులతో పాటు, బోల్ట్ కట్టర్, స్క్రూ డ్రైవర్లు, గ్లౌజులు, వాహనం (వాగన్ ఆర్), మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
టోల్ గేట్ల వద్ద సీసీటీవీ ఫుటేజ్ మరియు సాంకేతిక ఆధారాలతో ఈ కేసును ఛేదించినట్లు ఎస్పీ తెలిపారు.
నెల్లూరు జిల్లా దుత్తలూరు పరిధిలో జరిగిన మరో ఆలయ చోరీ కేసుతో ఈ నిందితులకు సంబంధం ఉందా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది.
ఈ కేసును వేగంగా ఛేదించిన డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐలు సునిల్ కుమార్, ధనుంజయ, అఖిల్ తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.
ప్రజలు ఆలయాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు






# రవి కుమార్ మరణంపై ఎమ్మెల్యే దగ్గుపాటి దిగ్భ్రాంతి

## రవి కుమార్ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం

**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 06, అనంతపురం**
అనంతపురం నగరానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి రవికుమార్ మరణం బాధాకరమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రవికుమార్ మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి సోమవారం సాయంత్రం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు రేపటి రామాంజనేయులు, టిడిపి నాయకులుతో కలిసి రవికుమార్ ఇంటికి వెళ్లారు. అక్కడ రవికుమార్ భార్యను ఓదార్చారు. చిన్న వయసులోనే రవికుమార్ అనారోగ్యానికి గురి కావడం, ఆ తర్వాత మరణించిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంలో రవికుమార్ కుటుంబ పరిస్థితి తెలుసుకున్నారు. ఇల్లు కూలిపోయే దశలో ఉందని... అలాగే ఆయనకు నలుగురు పిల్లలు ఉన్నట్లు తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పిల్లల చదువుల విషయంలో కూడా తమ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. అధైర్య పడవద్దని అన్ని విధాలుగా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. చిన్న వయసులోనే రవికుమార్ మరణించడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. జర్నలిస్టు సోదరులు విధి నిర్వహణలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని... ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు.



మృతి చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి రవికుమార్ (ఫైల్ ఫోటో):

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలి...



**గుత్తి ఏప్రిల్ 06 : రిపబ్లిక్ న్యూస్**
గుత్తి పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల నందు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగినది . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని , స్పోర్ట్స్ కోటా కింద ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు రావడానికి అవకాశం కలదు అని క్రీడల గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కళాశాల పిఈటి రవికుమార్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ రంగస్వామి, విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేత్ర బృందం పాల్గొనడం జరిగినది.

# టీబి రహిత గ్రామంగా భోజనం గ్రామం ఎంపిక

## జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న పంచాయతీ సెక్రెటరీ




**బండి ఆత్మకూరు, ఏప్రిల్ 6, (రిపబ్లిక్ న్యూస్ ):-** టీబి రహిత గ్రామాలే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ ముక్త్ పంచాయితీ కార్యక్రమం ద్వారా గ్రామాలను టిబి రహితంగా ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా, బండి ఆత్మకూరు మండలం, భోజనం గ్రామం టిబి రహిత గ్రామంగా ఎంపికైంది. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా మొత్తం 23 గ్రామ పంచాయతీలు టీబి రహిత గ్రామాలుగా ఎంపిక కాగా ఇందులో భోజనం గ్రామం కూడ ఒకటి. గత ఏడాది సేకరించిన శాంపిల్స్ లో అన్ని నెగిటివ్ రావడంతో ఈ అవార్డుకు ఎంపికైనట్లు వైద్యాధికారి దినేష్ తెలిపారు. ఎంపికైన గ్రామా పంచాయతీలకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబి నివారణలో ప్రజలను చైతన్య పరచడంలో కీలకంగా పనిచేసినగ్రామ పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది వల్ల టిబి రహిత గ్రామంగా ఎంపికైందని తెలిపారు. కాగా బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం సోమవారం నంద్యాలలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, క్షయ వ్యాధి నివారణ జిల్లా అధికారి శారదా బాయి చేతుల మీదుగా భోజనం గ్రామ పంచాయతీ సెక్రెటరీ చంద్ర నాయక్ అవార్డు అందుకున్నారు. ఆయన తోపాటు గ్రామంలో పని చేసే వైద్య ఆరోగ్య సిబ్బంది ఎంఎల్ హెచ్పి శిరీష రాణి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి అధ్యక్షతన నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో

# ఘనంగా జిల్లా మహిళా విభాగం ఆత్మీయ సమావేశం

**కల్లూరు ప్రతినిధి, ఏప్రిల్ 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన నంద్యాల జిల్లా పార్టీ ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు, ఎమ్మెల్సీ మరియు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా శక్తి సాధికారతపై ప్రసంగించారు. మహిళలు రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మహిళా విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, మహిళలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి,ఎమ్మెల్సీ ఇషాక్ భాషా ,మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి,జోనల్ ప్రెసిడెంట్ గాజుల శ్వేత రెడ్డి ,నంద్యాల జిల్లా అధ్యకురాలు సుజాతమ్మ ,రాష్ట్ర సెక్రటరీ వైజా అరుణ,కర్నూలు జిల్లా మహిళ అధ్యక్షురాలు మరియు మాజీ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక ,మహిళా విభాగం జనరల్ సెక్రటరీ శశికళ,మరియు పార్టీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు,మండల మహిళ విభాగం అధ్యక్షులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



# రెడ్ క్రాస్ సభ్యత్వాల పెంపుదలకు సహకరించండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):**జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాల అభివృద్ధికి ప్రతి శాఖాధికారి సహకరించాలని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో రెడ్ క్రాస్ సభ్యత్వాల పెంపుదలకు అధికారులు చురుకుగా ముందుకు రావాలని ఆమె సూచించారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ కార్యక్రమాలు జిల్లాలో అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలను అందించేందుకు సభ్యత్వాల పెంపు కీలకమని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. అనంతరం జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) సేకరించిన 56 రెడ్ క్రాస్ శాశ్వత సభ్యత్వాల దరఖాస్తులు మరియు వాటికి సంబంధించిన రూ.61,600 నగదును జడ్పీ సీఈఓ ద్వారా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఏవో షాన్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా సెక్రటరీ,స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ ఆకస్మిక తనిఖీ

**నంద్యాల ఏప్రిల్ 6 (రిపబ్లిక్ న్యూస్) :**
సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు తుగ్గలి నాగేంద్ర మరియు కార్యదర్శి కాటం ప్రకాష్ , నంద్యాల స్థానిక పద్మావతీనగర్ లో గల పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తుగ్గలి నాగేంద్ర , గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులని గ్రంథాలయములో మౌళిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా పాఠకులు , చదువుకునేందుకు ప్రత్యేక స్టడీ హాల్ మరియు పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త పుస్తకాలు అందుబాటులో వుంచాలని కోరారు. దీనికి వారు త్వరలో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు మరియు గ్రంథాలయ నిర్వహణ, సిబ్బంది సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ తుగ్గలి నాగేంద్ర పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థకు జిల్లాలో గల కార్పొరేషన్ వారు, మున్సిపాలిటీలు మరియు గ్రామపంచాయతీలు చెల్లించవలసినగ్రంథాలయ సెస్సు గురించి జిల్లా కలెక్టర్ తో చర్చించి సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి ఏమాత్రం కుంటు పడకుండా ఉన్నత లక్ష్యాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు మాకు ఇచ్చిన ఈ సదవకాశాన్ని వినియోగించుకుంటానని తెలిపారు. ఆయన వెంట గ్రంథాలయ సిబ్బంది డి.మధు, మక్బూల్ భాష ,ఆర్.ఇ.శ్రీధర్, పాఠకులు రాఘవ రెడ్డి ,వెంకటేశ్వర్లు, రవి, ఆదినారాయణ, శ్రీనివాసులు,లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.








# సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు

## ఘనంగా 15వ స్నాతకోత్సవ వేడుకలు - రాష్ట్ర గవర్నర్ హాజరు







**అనంతపురం జేఎన్టీయూ, ఏప్రిల్ 06, ( రిపబ్లిక్ న్యూస్ ):**

సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలు సుస్థిర అభివృద్ధి ముందుకు తీసుకెళ్లాగా బలమైన సామర్థ్యం మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. సోమవారం అనంతపురం జేఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన 15వ స్నాతకోత్సవా నికి గవర్నర్ ఛాన్సర్ హోదాలో, ముఖ్య అతిథిగా హాజరై వేడుకలకు శోభను చేకూర్చారు. అంతకుముందు జేఎన్టీయూ అతిధి గృహం వద్ద గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా గౌరవ గవర్నర్ కు జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ మధు మూర్తి, వై స్ ఛాన్సర్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డా. నాగప్రసాద్ నాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉపకులపతి హెచ్. సుదర్శన్ రావు అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

### విద్యార్థులు సత్ప్రవర్తనాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ అత్యుత్తమైన విద్య అంటే కేవలం మనకు సమాచారాన్ని అందించేదే కాదని మన జీవితంలో సమస్త సృష్టిలో సామరస్యంగా ఉండేలా తీర్చిదిద్దేనని రవీంద్రనాథ్ ఠాకూర్ పలికిన మాటలు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ విస్తృతమైన సంలీతమైన ఉన్నత విద్యాభివృద్ధి చేస్తోందని, మహిళల భాగస్వామ్యాన్ని పెంచి జాతీయ సగటు కంటే అధికంగా 36.5శాతం స్థూల నమోదు నిష్పత్తి 10.93 స్థూల సూచికతో స్థిరమైన పురోగతిని ప్రతిబింబి స్తోందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా2020అమల్లో భారతదేశం ఉన్నత విద్య పరివర్తనాత్మక మార్పుకు నాంది పలికిందని ఇది విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పారిశ్రామిక విస్తరణ మౌలిక సదుపాయాల ఆధునికరణ సమగ్ర ఆర్థిక పునరజీవనం దిశగా ముందుకు సాగుతోందని పునరుత్పాదక ఇంధనం ఎలక్ట్రానిక్ హార్డ్వేర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆహార శు ద్ధి వంటి రంగాలలో భారీ పెట్టుబడులు ఆకర్షిస్తూ మెరుగైన రహదారి నెట్వర్క్ అభివృద్ధి అంతర్గత జలమార్గాలు పోర్టుల ఆధారత అభివృద్ధి విమానాశ్రయాల విస్తరణ వంటి వాటికి పరిశ్రమ వాణిజ్యం కోసం ఒకస్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర గవర్నర్ తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోది నాయకత్వంలోని ప్రభుత్వం భారతదేశంను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా సాంకేతిక రంగాన్ని అనేక విధాలుగా తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు.

### పరిశ్రమకు సంబంధించిన కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయం కృషి

విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు క్రమబద్ధమైన ఇంటర్న్షిప్ అవకాశాలను కల్పించడానికి మాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సుల ద్వారా పరిశ్రమకు సంబంధించిన కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని ఐఐటి మద్రాస్ ఫ్యాకల్టీ డైరెక్టర్ లతో సహా వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ సహకారం ద్వారా విద్యార్థుల పారిశ్రామిక వాతావరణం భద్రత ప్రమాణాలు నియంత్రణ చట్టాలు నిత్య సమయకార్యాచరణ పద్ధతులపై విలువైన అవగాహన పొందుతారన్నారు. మీ జ్ఞానం మీకు మాత్రమే కాకుండా యావత్తు సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు తమ జీవితంలో ముందుకుసాగాలని నిజాయితీ పట్టుదల కరుణ అనే విలువలతో సత్ప్రవర్తనాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నిరంతరం నేర్చుకుంటూ నూతన ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు చేపట్టే అన్ని పనుల్లోనూ శాష్టత కోసం కృషి చేయాలి అన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం వారిని అన్ని విధాల ప్రోత్సహించాలన్నారు.

విద్యార్థులు పొందిన జ్ఞానం సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని మీరు సాధించిన విజయాలు మీరు చదువుకున్న విద్యాసంస్థకు గర్వకారణంగా నిలవాల న్నారు. ఈరోజు అనంతపురంలో విద్యార్థులకు ఒక కలల పండుగగా స్నాతకోత్సవం జరుగుతున్న నేపథ్యంలో తాను పాల్గొనడం ఎంతో అదృష్టంగా, సంతోషంగా ఉందన్నారు.అనంతరం కొంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారుపతకాలను, అలాగే పలువురికి పరిశోధకుల పీహెచ్డీ పట్టాలు ప్రధానం చేశారు.

### సాంకేతిక విద్యలో జేఎన్టీయూ జాతీయస్థాయిలో ప్రత్యేక స్థానం

ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ సుదర్శన్ రావు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం చిత్తూరు కడప కర్నూలు నెల్లూరు జిల్లాలోని సాంకేతిక ఔషధ కళాశాలలు జేఎన్టీయూ పరిధిలోకి వస్తాయని ఇంజనీరింగ్ ఫార్మసీ ఎంబీఏ ఎంసీఏ కళాశాలలు మొత్తం 130 దాకా ఉన్నాయన్నారు. అన్ని కళాశాలలో కలిపి వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈరోజు బంగారు పథకాలు అలాగే విశ్వవిద్యాలయం దీని అనుబంధ కళాశాలలో బీటెక్ బి ఫార్మసీ ఎంటెక్ ఎం ఫార్మసీ ఎంసీఏ ఎంబీఏ ఫార్మసీ డి పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు పీహెచ్డీ డాక్టర్ రేట్లు ప్రధానం చేయడం జరిగిందన్నారు.

ముఖ్యంగా సాంకేతిక విద్యలో అనంతపురం జేఎన్టీయూ జాతీయస్థాయిలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. సమాజానికి ఎంతోమంది శాస్త్రవేత్తలు ఇంజనీరింగ్ నిపుణులను అందించిన ఘనతఈవిశ్వవిద్యాలయానికి దక్కుతుందన్నారు. మరి ముఖ్యంగా ప్రముఖ అంతరిక్ష క్షిపని శాస్త్రవేత్త టెస్సీకు గౌరవ డాక్టరేట్ ప్రధానం గవర్నర్ చేతుల మీదుగా అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

### రక్షణ సామర్థ్యంతో దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టాలి

అంతకుముందు ప్రముఖ శాస్త్రవేత్త టెస్సీ థామస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఇన్స్టిట్యూట్ మెడల్స్ పొందిన టాపర్లకు మరియు 20 25 లో పట్టభద్రులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. స్నాతకోత్సవం అనేది పట్టుదలకు ఒక వేడుక అని క్రమశిక్షణకు ఒక నివాళి, అపరిమితమైన అవకాశాలకు ఒక ముఖ ద్వారం అని ఇది సంవత్సరాల తరబడి అంకిత భావం పట్టుదల, అభ్యసనం పట్ల అంచంచలమైన నిబద్ధతకు నిదర్శనం అన్నారు. విద్యార్థులు దీనిని కార్యరూపం దాల్చి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు.

తాను విద్యాప్రస్థానాన్ని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో ప్రారంభించి ఆ తర్వాత గైడెడ్ మిస్సెన్ లో ప్రత్యేకత సాధించి జేఎన్టీయూ హైదరాబాద్ నుండి మిస్సైల్స్ గైడెన్స్ లో పిహెచ్డి పట్టా పొందినట్లు తెలిపారు. డి ఆర్ డి ఓ లో నా వృత్తి జీవితం భారత దేశపు వ్యూహాత్మక క్షిపణి కార్యక్రమాలకు సాంకేతిక అభివృద్ధి తయారీ పరీక్ష వ్యవస్థ ధృవీకరణ, నిర్వహణ వంటి రంగాలలో పాలుపంచుకునే అవకాశం కలిగిందన్నారు. అంతేకాక అధునాతన రక్షణ పరిశోధనలో కీలక నాయకత్వం పాత్రలు పోషించే అవకాశాన్ని కల్పించిందన్నారు. అగ్ని ఒకటి నుండి అగ్ని ఐదు వరకు మనం స్వాలంబన సాధించి రక్షణ సామర్థ్యంతో భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టామని మన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల నిరంతర కృషి దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న శక్తిగా మారుస్తున్నట్లు తెలిపారు. ఈ గర్వించదగిన సందర్భంలో నా హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. ప్రస్తుత విద్యార్థులు వృత్తి నిపుణులుగా ఆవిష్కర్తలుగా వివిధ రంగాలలో రాణించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంగణం వెలుపల మీకోసం ఎదురు చూస్తున్న అద్భుతమైన ప్రపంచానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మాజీ మంత్రివర్యులు మరియు రాప్తాడు శాసన సభ్యురాలు శ్రీమతి పరిటాల సునీతమ్మ,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, వివిధ యూనివర్సిటీలకు కళాశాలకు చెందిన ఆయా యాజమాన్య ప్రతినిధులుజిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి ఎస్పీ సతీష్ కుమార్ ,చిత్తూరు ఏఎస్పీదేవదాస్,అనంతపురం డి ఎస్ పి శ్రీనివాస్ అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు , నార్పల తాసిల్దార్ శ్రీధర్ మూర్తి , అనంతపురం తాసిల్దార్ మోహన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు



# ఆరోగ్యకరమైన జీవనానికి ఈట్ రైట్ - వాక్

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకో శరీరానికి వ్యాయామాన్ని అందించు**

**ఆరోగ్యకరమైన సమాజానికి నాంది పలుకు**

**పండుగ వాతావరణంలో ఈట్ రైట్ - వాక్**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 6( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆహార భద్రతపై ప్రత్యేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్లో ఈట్ రైట్ – వాక్ కార్యక్రమాన్ని నిర్వహించగా, లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి రాందాస్ చౌరస్తా వరకు వాకింగ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ డిపార్ట్మెంట్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ పై పటిష్ట చర్యలు చేపట్టారు.

ఈట్ రైట్ ఫైట్ డీసీజ్, హెల్త్, ఫుడ్ సేఫ్టీ, సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, ఎడ్యుకేషన్, ఫారెస్ట్, పోలీస్ స్పోర్ట్స్, ఇరిగేషన్, మత్స్యశాఖ, ఇండస్ట్రీస్ జిల్లా పరిషత్,వివిధ శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది, పాల్గొన్నారు ఈరోజు సరైన ఆహారం ఆరోగ్య భవిష్యత్తు, ప్లే కార్డులు చేత బూని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది.

రాందాస్ చౌరస్తాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ హెల్త్ వీక్ కార్యక్రమంపై సుదీర్ఘంగా వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' – 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈరోజు నుండి వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

జిల్లాలోని ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.

శారీరక ఆరోగ్యం కోసం సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని, ఫాస్ట్ ఫుడ్కు దూరంగా ఉండి, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు వంటి సహజ ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుని శరీరానికి చక్కటి వ్యాయామాన్ని అందించి ప్రతి వ్యక్తి ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు.

శరీరానికి. శక్తిని అందించాలంటే ప్రోటీన్స్ తప్పనిసరిగా ఉండాలని ఫైబర్, ప్రోటీన్స్ ఉండే ఆహార పదార్థాలను ఎక్కువ తీసుకోవాలి కార్బోహైడ్రేట్స్ ను తగ్గించి తీసుకోవాలన్నారు శరీరానికి ఆహారం ఎంత అవసరమో వ్యాయామం కూడా అంతే అవసరమని చెప్పారు. ఈ హెల్త్ కి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో పనిచేసే ఉత్తమ వర్కర్ లను గుర్తించి, సత్కరిస్తున్నామన్నారు..ఏప్రిల్ 8న రక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సురక్షిత ప్రసవాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, పోషకాహారంపై విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 9న ఎయిడ్స్ నియంత్రణపై రెడ్ రన్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే ఎయిడ్స్ నివారణపై కళాజాతలు నిర్వహించి, ప్రజలకు అవగాహన




కల్పించాలని సూచించారు.

ఏప్రిల్ 10న హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా కేజీబీవీల్లో, యోగా కేంద్రాల్లో యోగా సాధన చేయించాలని, అలాగే ఆయుష్ పై ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

ఏప్రిల్ 11న మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డి .సి హెచ్ డాక్టర్ శివ దయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఎఫ్ఓ జో.జి, డీఈఓ విజయ, బి డబ్ల్యు.ఓ హేమ భార్గవి, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మత్స్య శాఖ అధికారి, మున్సిపాలిటీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి విజ్ఞప్తులను సత్వర పరిష్కారం చూపాలి

**: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**వివిధ సమస్యలపై ప్రజల నుండి 98 దరఖాస్తుల స్వీకరణ**





**మెదక్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 6 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, లతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తూ లిఖితపూర్వక వివరణ అందజేయాలన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**మల్లాపూర్ ఏప్రిల్ 6 (రిపబ్లిక్ న్యూస్)**
భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్లాపూర్ మండలం బిజెపి పార్టీ కార్యాలయంలో సోమవారం రోజున బిజెపి పతాక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సామాజిక లక్ష్యాల కోసం స్థాపించబడిన పార్టీ అని, ఉన్నతమైన ఆశయాల సాధన కోసం పార్టీ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ




త్యాగాలను స్మరించుకుంటూ, నాటి నుంచి నేటి వరకు ఆదర్శవంతమైన నాయకుల జీవితాలను, నేడు మార్గదర్శనం చేస్తున్న నాయకత్వ లక్ష్యాలను మరోసారి నెమరు వేసుకోవడం జరిగిందని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షులు లవంగ శివ, ప్రధాన కార్యదర్శి కాంతయ్య చారి, సీనియర్ నాయకులు డబ్బా రాజారాము, గడ్డం నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ముస్కిరీ రాజ్ కుమార్, బూతు అధ్యక్షులు ఇల్లెందుల మనోజ్ కుమార్, ఎర్ర రాజు, రాజేందర్, భుక్య రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అకస్మిక తనిఖీలో బయటపడిన నిర్లక్ష్యం

**చిన్నతుంబలం అంగన్వాడి సెంటర్‌పై అధికారుల ఆగ్రహం**



**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 06,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కర్నూలు జిల్లా చిన్నతుంబలం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సిడిపిఓ) మరియు సూపర్వైజర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాల్గవ అంగన్వాడి సెంటర్‌ను పరిశీలించిన అధికారులు అక్కడి పరిస్థితులను గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సెంటర్‌లో 2024 సంవత్సరానికి సంబంధించిన రాగిపిండి, బాలామృతం మరియు పాలు నిల్వలు సరిగా సంరక్షించకపోవడంతో లీకేజీ ఏర్పడి దుర్వాసన వ్యాపిస్తున్నట్లు గుర్తించారు. ఆహార పదార్థాలు సక్రమంగా నిల్వ చేయకపోవడం వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని గమనించిన సిడిపిఓ వెంటనే సంబంధిత అంగన్వాడి టీచర్ మరియు హెల్పర్‌ను పిలిపించి వివరణ కోరారు. అలాగే సెంటర్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహార నిల్వలను సక్రమంగా నిర్వహించాలని సూచనలు ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు టీచర్ మరియు హెల్పర్‌కు మెమో జారీ చేయనున్నట్లు తెలిపారు.అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు అందించే ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిడిపిఓ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీల సందర్భంగా గ్రామస్థులు కూడా అంగన్వాడి కేంద్రాల నిర్వహణపై మరింత శ్రద్ధ తీసుకోవాలని కోరారు

## ఘనంగా ప్రారంభమైన ఓపెన్ కబడ్డీ పోటీలు



**చిప్పగిరి, ఏప్రిల్, 06,( రిపబ్లిక్ న్యూస్)**
సోమవారం ఘనంగా ప్రారంభమైన ఓపెన్ కబడ్డీ పోటీలు చిప్పగిరి భం భం స్వామి ఊరుసు సందర్భంగా ఓపెన్ కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న,ఈ పోటీలకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జట్లు హాజరయ్యాయి.

ఈ క్రీడా కార్యక్రమాన్ని స్పాన్సర్లు కొండా పెద్దన్న, విజయ్ విట్టల పాఠశాల యాజమాన్యం యూసుఫ్,చంద్రమోహన్ లు ప్రారంభించారు.పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించగా, ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. గ్రామంలో క్రీడా ఉత్సాహం వెల్లివిరిసింది.

ఈ పోటీలలో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతిగా రూ.5000, రెండో బహుమతిగా రూ.3000, మూడో బహుమతిగా రూ.1500 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఇలాంటి కబడ్డీ పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇలాంటి పోటీలకు మంచి ఆదరణ లభిస్తున్నదని ఇటీవల జరిగిన వివిధ కబడ్డీ టోర్నమెంట్లు సూచిస్తున్నాయి.

## రైల్వే కోడూరులో సిఐటియు వ్యవస్థాపకఅధ్యక్షుడు బి టి రణదీవే కి ఘన నివాళి.- సి హెచ్ చంద్రశేఖర్.

**ఓబులవారిపల్లి ఏప్రిల్ 6 రిపబ్లిక్ న్యూస్.**
అఖిలభారత సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవే కి రైల్వే కోడూరులోని సిఐటియు ఆఫీసులో సోమవారం 36వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించాడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా, అన్నమయ్య సిఐటియు జిల్లా అధ్యక్షులు, సిహెచ్ చంద్రశేఖర్, మాట్లాడుతూ, 1904, డిసెంబర్ 19న బొంబాయిలో జన్మించారన్నారు, బ్రిటిష్ సామ్రాజ్యవాదం కు వ్యతిరేకంగా పోరాడన్నారు. 1928 లోనే, కార్మిక హక్కుల కోసం పోరాడారన్నారు,సంఘాలు నిర్మించి, కార్మిక నాయకుడిగా, జూట్ మిల్లులు, రైల్వే సమ్మె, నౌకాదళ నేవీ తిరుగుబాటుకు మద్దతుగా సమ్మె చేశారన్నారు, సంఘటిత కార్మికులతో పాటు, అసంఘటితరంగాల కార్మికులను ఐక్యపరిచారన్నారు. కమ్యూనిస్టు పార్టీకి రెండు సంవత్సరాల పాటు




జాతీయ కార్యదర్శిగాను పని చేశారన్నారు. స్వాతంత్ర్య అనంతరం, సోషలిస్టు లక్ష్యం కోసం, ఐక్యత ,పోరాటం నినాదంతో, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు 1970, మే 30 తేదీన కలకత్తాలో మహాసభల్లో ఏర్పడిన వ్యవస్థాపక అధ్యక్షులుగా బి టి ఆర్ ఎన్నికయ్యారు అన్నారు. దేశంలో అతి పెద్ద కార్మిక సంఘంగా అభివృద్ధి కావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఎమర్జెన్సీలో అరెస్టై జైలు జీవితం గడిపారన్నారు. 1964 లోసిపిఎం పార్టీ ఏర్పడినప్పుడు కీలక పాత్ర పోషించారు అన్నారు. పుచ్చలపల్లి.సుందరయ్య. జ్యోతి బస్సు , హరికృష్ణ సింగ్ సుర్జత్, తో కలిసి పని చేశారన్నారు. 1990 డిసెంబర్ 6న అమరులయ్యారున్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పోరాడటం, పోరాడి సాధించిన,కార్మిక హక్కుల కోసం పోరాడటం, సోషలిస్ట్ లక్ష్యం కోసం పనిచేయడమే. ఆయనకు మనం ఇచ్చేది నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు జిల్లా నాయకులు, ఏపీ ఎం డిసి జేఏసీ పోరాట కన్వీనర్, ఆర్ వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి పి జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు, లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి, నగిరిపాటి ఆనంద్, ఓబులవారిపల్లి సిఐటియు మండల కన్వీనర్, నాగిపోగు పెంచలయ్య, డివైఎఫ్ఐ నాయకులు, ఏదోటి ప్రేమ్ చందు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎలక్ట్రిక్ మోటార్ బైక్ షోరూంను ప్రారంభించి రూపానంద్ రెడ్డి





**ఓబులవారిపల్లి ఏప్రిల్ 6 రిపబ్లిక్ న్యూస్.**
మండల కేంద్రం చిట్వేల్ పట్టణం లో శ్రీ సద్గురు ఎంటర్ప్రైజెస్, ఎకో మోటివ్ మోటార్స్ ఈ-బైక్స్ గ్రాండ్ షోరూం ను రిబ్బన్ కట్ చేసి సోమవారం ముక్కా రూపానంద రెడ్డి ప్రారంభించడం జరిగినది గోపిదేశి ప్రసాద్ , భాను ప్రకాష్ , పిడుగు ప్రసాద్ ఆహ్వానం మేరకు రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ముఖ్య అతిథిగాఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ తో కలిసి ముక్కా రూపానంద రెడ్డి రిబ్బన్ కట్ చేసి ఎకో మోటివ్ మోటార్స్ ఈ-బైక్స్ షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం షోరూమ్‌ను సందర్శించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు, భద్రతకు అనుకూలమైన ఎలక్ట్రిక్ వాహనాలు ప్రజలకు అందుబాటులోకి రావడం మంచి పరిణామమని, ఇటువంటి వ్యాపారాలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ పరిష్కారంలో నిర్లక్ష్యం

## : అధికారులపై కలెక్టర్ అసంతృప్తి

**412 మందిలో 106 మందికి 'సున్నా' మార్కులు పనితీరుపై తీవ్ర అసంతృప్తి**

**సీఎం, డిప్యూటీ సీఎం ఎండార్స్ పిటిషన్ల నిర్లక్ష్యం సహించం**



**నంద్యాల, బ్యూరోఏప్రిల్ 06( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారుల పనితీరును సమగ్రంగా విశ్లేషించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 412 మంది అధికారుల పనితీరును ఓపిటిఎస్ ద్వారా అంచనా వేయగా, 106 మంది అధికారులకు గ్రీవెన్స్ పరిష్కారంలో 'సున్నా' మార్కులు రావడం ఆందోళనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సున్నా ర్యాంకింగ్ పొందిన అధికారుల్లో రెవెన్యూ శాఖ (తహసీల్దార్లు, సర్వే అధికారులు), పంచాయతీరాజ్ శాఖ (ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు), వ్యవసాయ శాఖ (అసిస్టెంట్ డైరెక్టర్లు), పోలీస్ శాఖ (ఎస్‌హెచ్‌ఓలు), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ సూపర్వైజర్లు), హౌసింగ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, అటవీ శాఖ, మార్కెటింగ్/మార్క్‌ఫెడ్, విద్యాశాఖ (ఎంఈఓలు), రూరల్ డెవలప్మెంట్, డిఆర్డిఏ, సర్వే & ల్యాండ్ రికార్డ్స్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారని తెలిపారు. ప్రత్యేకంగా ఆళ్ళగడ్డ, కొత్తపల్లి, కోయిలకుంట్ల, పాణ్యం, నందికొట్కూరు మండలాలు మరియు పట్టణ ప్రాంతాల్లో కొందరు అధికారుల పనితీరు సంతృప్తికరంగా లేదని సూచించారు. అయితే, కొందరు అధికారులు ప్రజలతో నేరుగా మమేకమై ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా మంచి పనితీరు కనబరిచారని అభినందించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎండార్స్ చేసిన పిటిషన్లను నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రమైన విషయమని కలెక్టర్ స్పష్టం చేశారు. మొత్తం 35 ముఖ్యమైన అర్జీలు పెండింగ్‌లో ఉంచడం లేదా తప్పుడు కారణాలతో మూసివేయడం గమనించినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్లను తిరిగి ఓపెన్ చేసి, వాటిపై జిల్లా స్థాయిలో ప్రత్యక్ష విచారణ కొనసాగుతోందన్నారు. ఈ 35 పిటిషన్లలో ప్రధానంగా రెవెన్యూ (సిసిఎల్ఏ), దేవాదాయ శాఖ (ఎండోమెంట్స్), అటవీ శాఖ (పిసిసిఎఫ్ పరిధి), విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, ఫ్యామిలీ వెల్ఫేర్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రూరల్ డెవలప్మెంట్, పోలీస్ శాఖ, సర్వే శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, వాటర్ రిసోర్సెస్ (ఈఎన్సీ), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదితర శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత ఆర్డీవోలు, ఎండోమెంట్స్ అధికారులు, అటవీ శాఖ అధికారులు పూర్తి వివరాలతో వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించారు. వికలాంగ బాలుడికి హౌస్ సైట్ మంజూరులో జరిగిన ఆలస్యంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి సున్నితమైన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచించారు. దేవాదాయ శాఖలో పిటిషన్ల పరిష్కారం మందగమనంగా ఉందని పేర్కొని, పనితీరు మెరుగుపరచాలని ఆదేశించారు. వచ్చే వారం ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా పిటిషన్లపై సమీక్ష జరగనున్న నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న అన్ని అర్జీలను తక్షణమే పరిష్కరించి 'జీరో పెండెన్సీ' సాధించాలని స్పష్టమైన గడువు విధించారు. మండల, డివిజనల్ స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు. సున్నా పనితీరు కనబరిచిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, పనితీరు మెరుగుపరచని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశించారు. పనితీరు ఆధారంగా అధికారులకు ర్యాంకులు కేటాయిస్తున్నామని, విధుల పట్ల బాధ్యతను పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. వచ్చే వారం అత్యధిక పెండింగ్ మరియు సున్నా పనితీరు కలిగిన 15 మంది అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## వేసవి దృష్ట్యా వచ్చేవారం నుండి పీజిఆర్ఎస్ ఉదయం 9:30 గంటలకే ప్రారంభం

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):** వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, వచ్చే వారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం పి జి ఆర్ ఎస్ నిర్వహణ సమయాల్లో మార్పులు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్, మే, జూన్ నెలలలో ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటలకు పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రజా ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రోజున అధికారులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవని స్పష్టం చేశారు. వాట్సాప్ సందేశాల ద్వారా సెలవులు అనుమతించబడవని, తప్పనిసరిగా ఈ-ఫైల్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి కార్యక్రమాల్లో జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, అనుమతి లేకుండా జిల్లా విడిచి వెళ్లినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి దిశగా ఐ జి ఓ టి కర్మయోగి ప్లాట్‌ఫారమ్‌లో అందుబాటులో ఉన్న కోర్సులను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అభ్యాస వారం (ఏప్రిల్ 2 నుంచి 8 వరకు) సందర్భంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ప్రతి అధికారి కనీసం 4 గంటల అభ్యాసాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. గడువు సమీపిస్తున్నందున ఏప్రిల్ 8 లోపు కోర్సులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కే పి ఐడేటా నమోదు విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, నిర్దేశిత వివరాలను సమయానికి నమోదు చేయాలని అధికారులకు సూచించారు. డాక్యుమెంట్ అప్లోడింగ్‌లో ఎంపీడీవోలు లక్ష్యాన్ని మించి పనితీరు కనబరిచినప్పటికీ, తహశీల్దార్లు మరియు జిల్లా స్థాయి అధికారులు వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే సోమవారం నాటికి తహశీల్దార్లు, జిల్లా అధికారులు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా వాట్సాప్ సేవల వివరాలను ప్రతి కార్యాలయం ముందు స్పష్టంగా ప్రదర్శించాలని, ఇందుకు సంబంధించిన ఫోటోలతో నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

**ప్రముఖ విభాగాల్లో వైద్య సిబ్బందిని పెంచండి -ఆసుపత్రిలో పారిశుద్యానికి అత్యంత ప్రాధాన్యత**

**వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా వసతులు ఏర్పాటు చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరోఏప్రిల్, 06 (రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఛాంబర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన మెరుగల వైద్య సేవలు అందించేందుకు పరికరాలు సంబంధిత అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.జిలానీ, డిసిహెచ్ఎస్ డా.ఓ.లలితా, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీర్లు నరసింహారెడ్డి జయరాంరెడ్డి, ఎడి మస్తాన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న మొత్తం 84 ఎయిర్ కండీషనర్లలో 29 పనిచేయకపోవడం గమనించిన కలెక్టర్, వాటిలో మరమ్మతులకు అనువైనవి ఎన్ని, కొత్తగా అవసరమయ్యేవి ఎన్ని అన్నదానిపై తక్షణ అంచనా వేయాలని ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, పాథాలజీ మరియు మైక్రోబయాలజీ ల్యాబ్‌లలో ఏసీలు సమర్థంగా పనిచేయడం అత్యవసరమని పేర్కొంటూ, ఈ విభాగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అయితే ఒప్పంద నిబంధనల ప్రకారం అవసరమైన నలుగురు శిక్షణ పొందిన వైద్యుల స్థానంలో కేవలం ఇద్దరు మాత్రమే ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడం, ఆయుర్వేద వైద్యులను నియమించడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే అర్హత కలిగిన నిపుణులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. డయాలసిస్ సేవలు ఉ.6.గం.ల నుంచి రా.12 గం.ల వరకు కొనసాగుతున్న నేపథ్యంలో, అత్యవసర పరిస్థితుల్లో రాత్రి కూడా కనీసం ఒక బెడ్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి మూడు యంత్రాలకు ఒక టెక్నీషియన్ ఉండేలా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.సిబ్బంది వయస్సు, ఆరోగ్యం, హాజరు వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆసుపత్రి భద్రత, మౌలిక వసతుల పరంగా ఫైర్ ఆడిట్, బ్లడ్ బ్యాంక్ ఆడిట్, ఎలక్ట్రిసిటీ, మెడికల్ ఆక్సిజన్ ఆడిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అంశాలపై స్పందించని విభాగాలకు వెంటనే లేఖలు పంపి, తదుపరి సమీక్షకు హాజరు కావాలని సూచించారు. భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, పాత నీటి ట్యాంక్ ప్రమాద స్థితి వంటి అంశాలపై కూడా చర్చించి, తాత్కాలికంగా నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని, శాశ్వత పరిష్కారం కోసం కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రేడియాలజీ విభాగంలో ఎక్స్‌రే యూనిట్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆసుపత్రి సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సంబంధిత విభాగాధిపతులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు.

# జిల్లాలో నీటి భద్రత సాధనకు

## అధికారుల సమిష్టి కృషి అవసరం

**100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం**

**చివరి ఆయకట్టు వరకు సాగునీటి సరఫరా లక్ష్యం**

**"యుక్తధార" ద్వారా పనుల పర్యవేక్షణ, జియో ట్యాగింగ్ తప్పనిసరి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో ఏప్రిల్ 06 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నీటి భద్రత సాధన ప్రతి అధికారి ప్రధాన బాధ్యతగా భావించి సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో "నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత" అనే అంశంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.10 మేరకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో "నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత" పేరుతో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు కొనసాగుతుందని, దశలవారీగా అమలు చేయాలని సూచించారు. పనుల అమలు షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6 నుంచి 15 వరకు పనుల గుర్తింపు, ఏప్రిల్ 16 నుంచి 20 వరకు మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలని, ఏప్రిల్ 21 నుంచి జూలై 9 వరకు పనులను అమలు చేయాలని, చివరగా జూలై 10 నుంచి 14 వరకు రిపోర్టింగ్ మరియు డాక్యుమెంటేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నీటి వనరుల సమర్థ వినియోగం, సాగునీటి అందుబాటు పెంపు, భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కన్వర్జెన్స్ కమిటీలో జలవనరుల శాఖ ఎస్ఈతో పాటు వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవనం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఎంఎన్ఆర్ఈజీఎస్, మత్స్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు తమ నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని ఎంఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమ ప్రారంభానికి సంబంధించిన ఫోటోలను పకడ్బందీగా డాక్యుమెంట్ చేసి పంపించాలని తెలిపారు. జిల్లాలో నీటి పారుదల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. కృష్ణా నది నుంచి శ్రీశైలం, పోతిరెడ్డిపాడు ద్వారా విడుదలయ్యే నీరు కేసీ కెనాల్, తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నందికొట్కూరు, డోన్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉన్నందున ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. పాములపాడు మండలంలో భూగర్భ జలాల తగ్గుదల దృష్ట్యా పునరుద్ధరణ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాలువలు పూడికపోవడం, ఫీడర్ మరియు ఫీల్డ్ ఛానల్స్ దెబ్బతినడం వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోందని పేర్కొంటూ, పూడికతీత, బుష్ క్లియరెన్స్, కట్టల బలపరిచే పనులను చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 330 మైనర్ ఇరిగేషన్ చెరువులను పూర్తి స్థాయిలో నీటితో నింపే లక్ష్యంతో కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఎంపీడీవోలు సమర్థంగా అమలు చేయాలని సూచించారు. అన్ని పనులను "యుక్తధార" సాఫ్ట్‌వేర్ ద్వారా మానిటర్ చేస్తామని, ప్రతి పనికి జియో ట్యాగింగ్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పనుల ప్రతి దశను డ్రోన్ ఫోటోలు, హై రిజల్యూషన్ చిత్రాలు, నివేదికల రూపంలో సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలను స్పష్టంగా నిర్వచించినట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహశీల్దార్‌లు, గ్రామ స్థాయిలో విఆర్ఓ, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువుల ఆక్రమణలను తొలగించి నీటి వనరులను సంరక్షించడం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సంజామల మండలం ఆకుమళ్ల వాటర్‌షెడ్ ప్రాజెక్ట్, డోన్‌లోని ఎత్తుపెంట ప్రాజెక్ట్‌లను అధికారులు సందర్శించి 'రిడ్జ్ టు వ్యాలీ' విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలపై దృష్టి సారించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ప్రారంభం, జియో ట్యాగింగ్ తక్షణమే చేపట్టాలని స్పష్టం చేశారు.

# నిర్ణీత గడువులోగా ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి

**పిజిఆర్ఎస్ ద్వారా 263 దరఖాస్తుల స్వీకరణ**

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 141 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా**







**నంద్యాల, బ్యూరో ఏప్రిల్, 06 (రిపబ్లిక్ న్యూస్):** ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యతనిస్తోందని అందుకు అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధతో అర్జీలను పరిష్కరించాలన్నారు. రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చే వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటికి తొలి ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా 263 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 141 అర్జీల స్వీకరణ**

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 141 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 4, అడంగల్ సవరణలకు సంబంధించినవి 11, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 17, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 12, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 28, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 63, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 6గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) డోన్ మండలానికి చెందిన రామకృష్ణ రెడ్డి తనకున్న ఎకరా 40 సెంట్ల భూమి ఎన్హెచ్ 340 బి నిర్మాణంలో పోవడం జరిగిందని అందుకు తగిన నష్టపరిహారాన్ని ఇంతవరకు తనకు అందలేదని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించగా సంబంధిత విషయంలో జాప్యం తగదని ఈ వారంలో హియరింగ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని డోన్ ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.లి

2) పాములపడు గ్రామానికి చెందిన నీలి ఆంజనేయులుకి గతంలో డి పట్టా ఇవ్వడం జరిగిందని, ఆయనకు ఇద్దరూ భార్యలు మొదటి భార్యకు ఒక కుమారుడు, రెండవ భార్యకు ఇద్దరు కుమారులు వీరికి సమానంగా భాగా పంపిణీ చేయాలని కోర్టు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, అయినప్పటికీ మొదటి భార్య కుమారుడు నీలి వెంకటరమణ ఆస్తి మొత్తం తనదని నకిలీ డి పట్టాను సృష్టించుకొని ఇబ్బంది కలుగజేస్తున్నారని రెండవ భార్య కుమారుడు జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించగా సదరు అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పాములపాడు తహశీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు.

3) ఆత్మకూరు మండలానికి చెందిన వీరంరెడ్డి రామచంద్రారెడ్డి తనకున్న యావదాస్తిని తన కుమారుల పేరు మీద వ్రాయడం జరిగిందని వారు ఇప్పుడు తన బాగోగులు చూడడం లేదని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించగా సీనియర్ సిటిజన్స్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓకు కలెక్టర్ సూచించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com